పోస్టాఫీసుకి పనిగట్టుకుని వెళ్లక్కర్లేకుండా ఇక్కడే పోస్టు చెయ్యొచ్చు" అని కూడా ముచ్చట పడ్డాడు. " ఆఖరు సారిగా ఉత్తరాలు క్లియర్ చేసేవేళ: సాయంకాలం నాలుగు గంటలు!" అని వుంది అక్కడ.

సరిగ్గా నాలుగింటికి మా అనంతం కవరు పట్టుకుని అక్కడికి వెళ్లేడు. "సారీ సార్!" అన్నాడు ఖాకీ డ్రస్‌లో ఉన్న ఒక అబ్బాయి.

"ఏమిటి, మీ పోస్టు మాస్టర్ గారు టపా కట్టేశారా?" అన్నాడు అనంతం.

"ఏమండోయి. మాటలు జాగర్తగా రానియ్యండి" అన్నాడతను. ఆ తరవాత ఇతనన్న మాటకి అక్కడ పెద్ద గొడవై పోయింది. ఉత్తరాంధ్రలో "టపా కట్టెయ్యడం" అంటే చచ్చిపోడం అనే అర్థం వుందని మా అనంతానికి తెలిసింది కాదు.

మొన్న క్రిస్మస్ సందర్భంగా మెదక్‌లో జరిగే ఉత్సవాలను "కవర్" చెయ్యడానికి అనంతం అక్కడికి వెళ్లేడు. "అక్కడ మీ వసతి వగైరా ఏర్పాట్లకి మీరేం గాభరా పడక్కర్లేదు. మెదక్‌లో మన మేనేజింగ్ డైరక్టరు గారబ్బాయికి ఒక ఇండస్ట్రీ వుంది. ఆయన్ని కలవండి, చాలు" అని ఎడిటర్‌గారు అనంతానికి చెప్పేరు.

అట్నుంచొచ్చేక ఎడిటర్‌గారు అనంతాన్ని అడిగేరు. "నీ ట్రిప్ బాగా జరిగిందా? ఇబ్బంది ఏం పడలేదు కదా?"

" ఏంటోనండి. మీరు చెప్పేరు కదాని ఆ ఇండస్ట్రీకి వెళ్లేను. ఏర్పాట్ల మాట అలా వుంచి ఆ "ఎమ్డీకొడుకు" నన్ను కనీసం కూర్చోమని కూడా అన్లేదు." అన్నాడు అనంతం.

ఆ మాట చిలవలు పలవలుగా ఎలా ఎలా ఎక్కడి కెళ్లిందో మరి. అనంతానికి మళ్లీ ఉద్యోగం పోయింది.

★

# 89. శంకరం (సం)గతులు

నేనెక్కిన బస్సులో వెనక సీట్లో కూర్చున్నాడు గావును రామచంద్రయ్య; అనకాపల్లిలో దిగిపోతూ ఉన్నప్పుడు కండక్టరు వెనక సీటులో కూర్చున్న నన్ను పలకరించేడు. "అయ్యో, ఇంతసేపూ నువ్వా ఈ బస్సులోనే వున్నావా? ముందు తెలిసుంటే ఇద్దరం వో దగ్గిర కూర్చుని కబుర్లు చెప్పకుంటూ ప్రయాణం చేసేవాళ్లం సుమీ"

"పోన్లే ఇప్పుడేం పోయింది? ఇక్కడ దిగిపోవలసినంత గండ కత్తెర లేకపోతే నాతోబాటు నరిసీపట్నం ఒచ్చీ. కబుర్లు చెప్పుకుంటూ పోదాం. రేపు తెల్లారి ఫస్టుబస్‌లో వొచ్చేద్దాం." అన్నాను.

"నాకాయోగ్యత లేదు. ఇవాళ ఇక్కడ ఓ కేసు వాదించాలి. అదృష్టం అంతా నీదే" అన్నాడు రామచంద్రయ్య.

"యోగ్యతా, అదృష్టం; అంటున్నావు. నేనూ నీలాగే డ్యూటీమీద అఘోరిస్తున్నాను."

కండక్టరు "రై, రై" చెప్పేడు.

"డ్యూటీ అఘోరించినా సరే, రాత్రికి శంకరం ఇంటికెళ్తావు. అదే నీ అదృష్టం" అని రామచంద్రయ్య కనుమరుగయిపోయేడు.

బస్సు హటాత్తుగా అందుకున్న "పికప్"కి నా పక్కసీటు మనిషి హడావిడిగా చతికిల బడ్డంలో నా తొడమీద కూర్చున్నంత పని చెయ్యడం తెలియలేదు. శంకరం నర్సీపట్నంలో ఉన్నాడనీ, వాడి చతురోక్తుల తీపిలో నా డ్యూటీ ఇచ్చే విసుగుని మర్చిపోవచ్చుననీ ఊహ కలిగి నాలో నేనే రంగురంగుల డ్యూయెట్లు పాడే కొత్తరకం సినీమా పాత్రలా అయిపోయాను.

నేనూ, శంకరం, రామచంద్రయ్యా నాలుగేళ్లపాటు విజయనగరం కాలేజీలో క్లాస్ మేట్స్. మాముగ్గురిలో శంకరం హాస్యప్రియుడూ, సంభాషణా చతురుడూనూ. విడిపోని నిరంతర త్రయంగా మాకు పేరొచ్చింది; ముద్ర పడింది. మేం ముగ్గురం ఒకసారి ఒక పాఠం బోధపడక మా లెక్చరర్ గారింటికి వెళ్లి ఆ పాఠం మరోసారి చెప్పించు కుందామని బయల్దేరాం. తలుపు కొట్టిన కొంతసేపటికి మేష్టారు తలుపు అవతలివేపునుంచి "ఎవరూ?" అని అడిగేరు.

"శంకరాంగోపాలచంద్రయ్య" అన్నాడు శంకరం మా ముగ్గురిపేర్లూ కలిపి.

దాంతో ఆ సంయుక్తనామం కూడా మాకు స్థిరపడింది.

రామచంద్రయ్య అనకాపల్లిలో ఎడ్వకేటుగా స్థిరపడ్డాడు. నేనూ శంకరం మాత్రం టూర్లూ ట్రాన్స్ఫర్లూ వుండే గవర్నమెంటు ఉద్యోగాల్లోకి వెళ్లాం. ఇద్దరం ఒక వూళ్లో ఎన్నడూ పని చెయ్యలేదు గాని అక్కడక్కడ తారస పడ్డం కాకతాళీయంగా జరిగినా అదేదో "టు ఈచ్ హిజ్ ఓన్ డ్యూ" (ఎవరికెంత ప్రాప్తమో అంత) లా అనిపించేది. నేనొకసారి అదే అంటేనే, శంకరం ; "మనవాళ్లు దీన్నే- చేసుకున్న వాడికి చేసుకున్నంత మహదేవా-అన్నారు." అన్నాడు.

ఓసారి నేనూ శంకరం విజయనగరం బస్‌స్టాండులో ఒకే సమయంలో రెండు బస్సుల్లోంచి దిగి పలకరించుకున్నాం. "నేను ఎక్స్‌ప్రెస్ బస్సులో వచ్చాను. నువ్వు నాన్ స్టాపు బస్‌లో వచ్చినట్టున్నావు" అన్నాను.

"లేదు; నేను నానా స్టాప్ బస్‌లో వచ్చేను" అన్నాడు శంకరం.

ఒక పెళ్లి సంబంధం గురించి మాట్లాడడానికి వచ్చేనన్నాడు. "నేను ట్రావెలర్స్ బంగళాలో ఉంటాను. నువ్వుగాని రాత్రికి ఇక్కడ ఉండవలిసొస్తే అక్కడ కొచ్చే." అన్నాను. "లేదు; నేను జగన్నాథం గారింటికెళ్తాను" అన్నాడు. "అతనెవరు? ఈ వ్యవహారంలో మధ్యవర్తా?" అన్నాను. "కాదు. అతను ఎలాటి వ్యవహారాల్లోకీ రాడు. మద్యవర్తి; అంతే" అని, నాకు అర్థంకాదేమో అనుకున్నట్టు "జగమే మాయ" అనే పాటని విజిలేశాడు. (నాకు "చుక్కవర్తి" గారు బాగా తెలుసునని శంకరానికి తెలియదు.) విజిలెయ్యడం గురించి శంకరం మేం చదువుకున్న రోజుల్లో ఒక జోకు చెప్పేవాడు.

ఒకమ్మాయి తన క్లాస్మేటయిన ఇంకో అమ్మాయితో అందిట: "అల్లదుగో చూడు ; గళ్ల ఫాంట్‌లో చారలచొక్కా టకప్ చేసుకుని వెళ్తున్నాడు; మా అన్నయ్య కోసం అప్పుడప్పుడు మా ఇంటి కొస్తూంటాడు; అతనంటే నాకెంత అసహ్యమో!"

"ఎందుకు, నీ కతనంటే అసహ్యం?"

"ఆ అబ్బాయికి బూతుపాట లెన్నోవచ్చు!"

"నీ ముందు పాడేడా?"

"లేదు; విజిలేస్తాడు!"

అమ్మాయి లిద్దరు "పచ్చీపాడూ" (పిచ్చాపాటీకి శంకరం పెట్టిన పేరు) చెప్పుకుంటూండగా ఓ అమ్మాయి అడిగిందట: "ఈ మొహాళ్లు మనం ఎవరం లేనప్పుడు ఏం మాట్లాడుకుంటారో?"

"ఏముందీ, మనలాగే ఏవో కబుర్లు-"

"ఛీ, అసయ్యం, కాదూ?"

ఇది కూడ శంకరమే చెప్పేడు.

ఆ మధ్య కొన్నాళ్లు శంకరం ఒక మినిస్టర్ గారి పి.ఏ. గారి ఆఫీసులో పనిచేసేడు. ఒకసారి ఒక పత్రికా విలేఖరి ఆ మినిస్టర్ గార్ని గురించి తను పనిచేస్తున్న పేపర్‌లో ఒక రైటప్ రాయడానికి వస్తే మినిస్టర్‌గారు అతనికి ఇంటర్‌వ్యూ ఇచ్చేలోగా నడిచిన సంభాషణలో కొంత భాగం :

"మీ మినిస్టర్ గార్ని గురించి మీ ఎసెస్‌మెంటు ఏమిటి?"

"అబ్బో? ఆయన చాలా తెలివిగలవారు కారు. కాని అలా కనిపిస్తారు. అదే వారి తెలివి."

"బాగా చెప్పేరు. ఒక ఉదాహరణ ఇవ్వండి?"

"ఆయనికి నం-స్కారంలో మెలికలు బాగా తెలుసు. కాని సంస్కారంలో మెలకువలు బాగా తెలుసని ఒప్పించగల సమర్థుడు".

"ఆయన హాబీలు ఏమిటి?"

"హామీలే ఆయన హాబీలు"

"కాని ఆయన చాలా మంచి వక్త కదా?"

"ఎక్కడ రుచిగలదో అక్కడ అనారోగ్యము కలదు-అన్నట్టు, వక్తల్లో భుక్తలుండక తప్పదు"

"డవునూరు" దగ్గిర ఒక భూమి తగాదా పరిష్కరించడానికి నరిసీపట్నం వెళ్లిన నేను, తగువాడు కుంటున్న రెండు పార్టీల్లో ఒకరు "సకారణంగా" రాలేకపోతున్నారని ఆ పార్టీ తరఫున న్యాయవాది అఫిడవిట్ దాఖలు చేయడం వల్ల వాయిదా ఇచ్చి ఆ పల్లెటూరు నుంచి వెంటనే తిరుగు ప్రయాణం కట్టేను. బోలెడు టైమ్ ఉంది కదా అని నరిసీపట్నంలో ఆగి శంకరం ఇంటికి వెళ్లేను. "ఆయనకేటి బాబూ; లచ్చాదికారి" అని నా ఫ్యాన్ నన్ను ఎంకరేజి చేశాడు.

"ఇప్పుడందరూ లక్షాధికార్లే. అదుగో, కలర్ టీవీ: పాతిక వేలు. దానికింద వుంది చూడు, వి.సి.ఆర్ - అదో పాతికవేలు. ఆ హాల్లో వున్న సోఫా సెట్టు ఆ గదిలో వున్న 'డబలు కాటు' మంచం కలిపి పాతిక వేలు. బైట వుంది చూసేవుకదా మోటర్ సైకిలు - హోండా అని పేరేగాని అదో గూండా; అదో పాతిక వేలు. మొత్తం లక్ష అయింది!" అది, శంకరం ఎనాలిసిస్.

"పోన్లే. రిటైరైపోయాక శాంతిగా వున్నావు. సంతోషం" అన్నాను.

"నాకు అంతా శాంతే. మా ఆవిడే డెబ్బయి కేజీలుంది. దాని పేరు శాంతమ్మ; నీకు తెలుసుగా?"

"అదికాదు శంకరం-" అని ఏదో, అతనన్నమాటకి నేను సంజాయిషీ చెప్పబోయాను.

"ఇంకేమీ అనకు. నాకేం లోటు లేదు. మా ఆవిడ అహల్యనీ, ఇద్దరు తారలనీ మించిన పతివ్రత" - అని శంకరం ఏదో చెప్పేస్తూవుంటే - లాస్టు బస్సు కింకా టైముందని నేను లేచి బయల్దేరి బష్టాండు కొచ్చేశాను. ★

# 90. దొరకునా, ఇటువంటి దొంగ?

**మా** స్నేహితుడు సత్యప్రసాదూ నేనూ ఓసారి ఏదో అపురూపమైన పుస్తకం కోసం రామమోహన బుక్ షాపుకి వెళ్లేం. షోకేసులో ఉన్న పుస్తకాల వరసలన్నీ వెతికినా మాకు ఆ పుస్తకం కనిపించక పోయేసరికి అక్కడున్న సేల్సుమన్‌ని ఫలానా పుస్తకం ఉందా అని అడిగాం. "ఆ పుస్తకం కాపీలన్నీ అయిపోయాయనుకుంటానండీ. ఐనా ఓసారి లోపలి గదిలోకి వెళ్లి మా ప్రొప్రయిటరు గార్ని అడగండి" అన్నాడా అబ్బాయి. ఆ విధంగా ఆ షాపు ప్రొప్రయిటరు గారి దర్శనం అవుతోంది కదా అని సరదాపడుతూ లోపలిగదిలోకి వెళ్లాం. ప్రొప్రయిటర్‌గారు కూడా మా దర్శనం అయినందుకు సరదా పడిపోయి, "పుస్తకం సంగతి తరవాత ఆలోచిద్దాం. ముందు కాఫీ తాగండి!" అని మా కిద్దరికీ చెరో స్టెయిన్ లెస్ స్టీల్ గ్లాసులోనూ కాఫీ పోయించి ఇప్పించేరు. ఉన్నట్టుండి సత్యప్రసాద్ "హి హి హి. భలే రాయించేరే!" అన్నాడు; తను పట్టుకున్న గ్లాసుమీదున్న అక్షరాలు చూపిస్తూ.

"ఈ గ్లాసు రామమోహన బుక్‌షాపు నుండి దొంగిలించడ మైనది." అని వుంది, ఆ గ్లాసుమీద. నేను నా(కిచ్చిన) గ్లాసు చూస్తే దానిమీద కూడా అలాగే వుంది.

"ఇక్కడికొచ్చి కాఫీలు తాగే పెద్ద మనుషుల్లో ఎవరయినా ఆ గ్లాసులు సంచీల్లో పెట్టుకుని చల్లగా జారుకుంటారనుకోండి; తీరా ఇళ్లకెళ్లేక చూసుకుంటే ఈ రాత కనబడి నవ్వూ ఏడుపూ కలిసికట్టుగా వొచ్చేస్తాయి.." అని సత్యప్రసాద్ ఆ రచనకి వ్యాఖ్యానం చేసేడు.

ఇంకోసారి రమణారావూ నేనూ ఒక హోటలుకి వెళ్లాం. మేం ఆర్డరిచ్చిన ప్రకారం సర్వర్ ఇడ్డెన్లు తెచ్చాడు. "అబ్బా! ఎంత చిన్నవి చేసేరో. ముద్దొస్తున్నాయి కదూ!" అన్నాను. ఆ ఇడ్డెన్ల సైజు రమణారావుకి చూపించి.

ఇడ్డెన్లు ఒక్కొక్క ప్లేటు తీసుకుందామని వెళ్లిన మేం చెరో నాలుగు ప్లేట్లూ తినవలసి వచ్చిందంటే అది ఆ ఇడ్డెన్ల సైజు వల్లనే తప్ప రుచి వల్ల కానే కాదని నేను తీర్మానించుకున్నాను.

ఆ తరవాత మేం కాఫీలు రప్పించుకున్నాం. కాఫీ తాగడం ఇలా మొదలెట్టేమో లేదో, అలా చెంగున వెళ్లి బిల్లు తెచ్చి అక్కడ పెట్టేడు సర్వరు. "అవును గానీ, నటేశం; ఈ కప్పులు ఎక్కడ కొన్నారో చెప్తావా, ప్లీజ్; నీకు పుణ్యాం వుంటుంది." అని రమణారావు సర్వర్ని బ్రతిమాలి అడిగాడు.